క్లుప్తంగా

తహసీల్దార్‌గా చిన్నారావు బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ చిన్నారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

ఏలేశ్వరం: మండల తహసీల్దార్‌గా జి.చిన్నారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన సూరపరాజు కాకినాడ కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. గండేపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న చిన్నారావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చిన్నారావు మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సిబ్బంది తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వీఆర్వోలు అవసరాల కిషోర్, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం



ఏలేశ్వరంలో వలంటీర్లను సన్మానిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు

ఏలేశ్వరం: వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ కౌన్సిలర్లు బదిరెడ్డి గోవిందు, సామంతుల హైమావతి అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా స్థానిక 5వ సచివాలయంలో గురువారం వలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు నేరుగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సామంతుల సూర్యకుమార్, జువ్విన వీర్రాజు, పతివాడ రామకృష్ణ, బాబ్జీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తలుపులమ్మతల్లికి ప్రత్యేక పూజలు



తలుపులమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

తుని: లోవ దేవస్థానంలో భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి జన్మ నక్షత్రం శ్రవణం సందర్భంగా ఉదయం పండితులు అమ్మవారికి 108 కళాశాలతో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ఈఓ విశ్వనాథరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వ్యక్తి అదృశ్యం



నమ్మి వీరబాబు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని గజ్జనపూడి గ్రామానికి చెందిన నమ్మి వీరబాబు (24) గత ఆరు రోజులుగా కనబడటం లేదంటూ అతని బంధువులు గురువారం ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరబాబుకు నాలుగేళ్ల క్రితం కొత్తపల్లి గ్రామానికి చెందిన లోవలక్ష్మితో వివాహమైంది. వారికి ఇటీవల పాప జన్మించింది. పాపను చూసేందుకు కొత్తపల్లి వచ్చాడు. భార్యబిడ్డలతో గడిపి గజ్జనపూడి వచ్చి అక్కడ నుంచి ఈ నెల 2న తిరుపతి పని నిమిత్తం బయలుదేరి వెళ్లాడు. సామర్లకోట వరకూ వీరబాబు మొబైల్ ఫోన్ పనిచేసింది. అక్కడ నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యి వీరబాబు ఆచూకీ లభించలేదని బంధువులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 89850 69695 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మల్లేపల్లిలో జూనియర్ కాలేజీ

గండేపల్లి: మల్లేపల్లి హైస్కూల్‌లో ఈ ఏడాది నుంచి బాలికల జూనియర్ కళాశాలను ప్రారంభించనున్నట్టు హైస్కూల్ హెచ్‌ఎం సుధా మాధురి గురువారం తెలిపారు. నూతనంగా ప్రారంభం కానున్న కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, బస్ పాస్ సౌకర్యం, ఉచిత మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



బైక్‌పై వెళుతూ కొంగుతో ముఖం దాచుకుంటున్న మహిళ



ఎండకు జనం లేక వెలవెలబోతున్న ఏలేశ్వరం వారపుసంత



ఏలేశ్వరంలో ఎండను తట్టుకోలేక ముసుగులు వేసుకున్న వాహనదారులు



జ్యూస్ తాగుతున్న యువకులు

హాటుపాట్లు

- మండిపోతున్న ఎండలు
- నిర్మానుష్యంగా మారిన రహదారులు
- వెలవెలబోయిన వారపుసంత

ఏలేశ్వరం: మెట్టలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచే భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. నియోజకవర్గంలో గురువారం 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రోహిణికార్తె ముగిసి మృగశిర కార్తె ప్రారంభమైంది. ఉదయం నుంచి ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో నిత్యం రద్దీగా ఉండే రహదారులపై జనసంచారం కరువైంది. వాహనాల రాకపోకలు తగ్గుముఖం పట్టాయి. ఎండల తీవ్రతకు మూగజీవాలు దాహార్తిని ఎదుర్కొన్నాయి. ఏలేశ్వరం వారపు సంత వెలవెలబోయింది. ప్రజలు శీతల పానీయాలను ఎక్కువగా తీసుకుంటున్నారు.

ప్రత్తిపాడు రూరల్: ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గత పది రోజులుగా 40 నుంచి 45 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఎండ తీవ్రతను తట్టుకోలేక ప్రజలు విలవిల్లాడుతున్నారు. నైరుతి రుతుపవనాల రాకకోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. సహజంగా జూన్ మొదటి వారంలోనే రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించడంతో వాతావరణం చల్లబడుతుంది. ఈ ఏడాది రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో భానుడు రోజురోజుకూ ఉగ్రరూపం దాల్చుతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాడు. మరో ఐదు రోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగుతుందని, అక్కడక్కడ ఆకాశంలో మేఘాలు కమ్ముకుని వర్షం కురిసే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ వెల్లడించింది.



పెద్దిపాలెం ఏలేరు కాలువలో జలకాలాడుతన్న యువకులు

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



బవురువాకలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని బవురువాకలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి వార్ల విగ్రహప్రతిష్ఠ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ చేతుల మీదుగా ఈ విగ్రహప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం పండితులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామ సర్పంచ్ బొడ్డి సత్యనారాయణ, కించు కన్నారావు, కాకర కర్రియ్య, పసగడుగుల సత్తిబాబు, నందా సత్తిబాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

గోకవరం: మండలంలోని అచ్యుతాపురంలో నూతనంగా నిర్మించిన పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 10న ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. దీనిలో భాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రారంభోత్సవంలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

పురగిరి క్షత్రియ భవనం ప్రారంభం



చిల్లంగితో పురగిరి క్షత్రియ మల్టిపుల్ భవనాన్ని ప్రారంభించిన ఎంపీ గీత, ఎమ్మెల్యే చంటిబాబు

కిర్లంపూడి: చిల్లంగిలో నూతనంగా నిర్మించిన పురగిరి క్షత్రియ మల్టిపుల్ భవనాన్ని కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గురువారం ప్రారంభించారు. గ్రామస్తుల కోరిక మేరకు ఎంపీ నిధులు రూ.15 లక్షలతో పురగిరి క్షత్రియ మల్టిపుల్ భవనానికి గతేడాది డిసెంబర్– 5న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే చంటిబాబు శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణ పనులు పూర్తికావడంతో అట్టహాసంగా ప్రారంభించారు. తొలుత మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం నివాసంలో ఎంపీ, ఎమ్మెల్యే అల్పాహారం స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు దోమాల గంగాధర్, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు సంఘన సూర్యకుమారి, బిళ్ళకుర్తి నాగమణి, మొల్లేటి సరస్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు తోట గాంధీ, పెంటకోట నాగబాబు, గణేశుల లచ్చబాబు పాల్గొన్నారు.

శంఖవరం ఎంపీడీఓగా శివరామకృష్ణయ్య



శివరామకృష్ణయ్య

శంఖవరం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జి.శివరామకృష్ణయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురులో ఈఓపీఆర్డీగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన జె.రాంబాబు ముమ్మిడివరం బదిలీపై వెళ్లారు. ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన శివరామకృష్ణయ్యకు కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

తుని ఎంపీడీఓగా రవికుమార్

తుని: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా మొవ్వ మండలంలో పరిపాలన అధికారిగా పని చేస్తున్న రవికుమార్ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మండలాభివృద్ధి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన ఎంపీపీ బొప్పన రాము, జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యామణి, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, పోతల రమణను మర్యాద పూర్వకంగా కలిశారు.

గోకవరం ఎంపీడీఓగా పద్మజ్యోతి

గోకవరం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.పద్మజ్యోతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ముమ్మిడివరంలో ఈఓపీఆర్డీగా చేస్తూ పదోన్నతిపై ఎంపీడీఓగా ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా కేఎస్ఎస్ఎన్ మూర్తి బాధ్యతలు నిర్వహించారు. నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన పద్మజ్యోతిని ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పద్మజ్యోతి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు టంకాల శ్రీనివాస్‌రావు, రమణ కుమారి, గన్నిరాజు, శివ, గోపన్న, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.



తునిలో ఎంపీడీఓ రవికుమార్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీపీ రాము, సిబ్బంది



గోకవరంలో ఎంపీడీఓ పద్మజ్యోతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యదర్శులు

వ్యవసాయ ఉత్పత్తి సంఘాలను అభివృద్ధి చేయాలి



రౌతులపూడి వైఎస్సార్ క్రాంతిపథం సిబ్బంది, వ్యవసాయ ఉత్పత్తి సంఘాల ప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం సరస్వతి

రౌతులపూడి: వ్యవసాయ ఉత్పత్తి సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందికి ఏపీఎం సరస్వతి సూచించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గురువారం మండలంలోని వ్యవసాయ ఉత్పతి సంఘాల ప్రతినిధులు, వీఓఏలు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలో ఇప్పటివరకు సుమారు 150 వ్యవసాయ ఉత్పత్తి సంఘాలు ఉన్నాయన్నారు. ఆ సంఘాలన్నీ వివిధ బ్యాంకుల్లో పొదుపు ఖాతాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో మరిన్ని సంఘాలను ఏర్పాటు చేసి వ్యవసాయ ఉత్పత్తికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో సీసీలు అప్పారావు, ప్రకాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి ఇంట్లో చోరీ

పిఠాపురం: మండలంలోని ఎఫ్‌కే పాలెంలో సచివాలయ ఉద్యోగి ఇంట్లో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు పిఠాపురం రూరల్ ఎస్సై అబ్దుల్‌నబీ తెలిపారు. వివరాల్లోకి వెళితే..పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలేనికి చెందిన వెంపటాపు దుర్గాప్రసాద్ పిఠాపురం పట్టణ వార్డు సచివాలయంలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు.

స్వగ్రామం ఎఫ్‌కేపాలెంలో నివాసం ఉంటున్న ఆయన బుధవారం రాత్రి ఇంటికి తాళం వేసి తన సోదరుడి ఇంటికి వెళ్లాడు. గురువారం మధ్యాహ్నం వచ్చే సరికి తన ఇంటి తలుపుల తాళాలు పగులగొట్టి ఉండడం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.25 వేల నగదు, మూడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరుకు రోడ్లతో ఇక్కట్లు



శంఖవరం-కత్తిపూడి కూడలి వద్ద నిలిచిన ఆటోలు



కత్తిపూడి రహదారిపై భారీ స్థాయిలో నిలిపిన వాహనాలు

- నిబంధనలకు విరుద్ధంగా వాహనాల నిలిపివేత
- తరచూ ట్రాఫిక్ సమస్య
- ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది

శంఖవరం: వివిధ గ్రామాలకు అనుసంధానంగా నిర్మించినరహదారులు ఇరుకుగా, రద్దీగా మారడంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ముఖ్యంగా ప్రధాన జంక్షన్ల వద్ద ఈ సమస్య మరింత ఎక్కువైంది. మండలంలో కత్తిపూడిలోని నాలుగు కూడళ్ల ప్రధాన జంక్షన్ వద్ద నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఇటు శంఖవరం వెళ్లే రోడ్డు, అటు కాకినాడ, మరో వైపు రాజమహేంద్రవరం, ఇంకో వైపు తుని వెళ్లాలంటే ఈ ప్రధాన రహదారి వెంబడే వెళ్లాలి. సుమారు 25 గ్రామాలకు కూడలిగా ఉన్న కత్తిపూడి అండర్ పాస్ వంతెన వద్ద రోడ్డుకు ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. లారీలు, ఆటోలు, బైక్‌లు, చిరు వ్యాపారులు బండ్లు రోడ్డుపై నిలిపివేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలు ఇబ్బంది కలిగి ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోతోంది. ప్రయాణికులు సమయానికి గమ్యానికి చేరుకోలేక అవస్థలు పడుతున్నారు.

ఆక్రమణలో రోడ్డు..

ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గతంలో కత్తిపూడి మీదుగా వెళ్లే 216 రహదారి, 16 నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. గ్రామంలో కొన్ని ఇబ్బందులు ఏర్పడినప్పటికీ రోడ్డు విస్తరణ జరిగింది. అయితే మళ్లీ యథావిధిగా కొంత మంది ఆక్రమణలు చేపట్టడంతో రోడ్డు ఇరుకుగా మారిందని పలువురు అంటున్నారు. అధికారులు దృష్టి సారించి ఆక్రమణలు తొలగించి, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు



కత్తిపూడి అన్ని గ్రామాలకు ముఖ్య కూడలి. దీంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగి స్తుంటాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అంతేకాక నిత్యం ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అధికారులు, పోలీసులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

–కొల్లు వెంకట రమణ, ఆటోడ్రైవర్, జి.కొత్తపల్లి

రోడ్డుపైనే వాహనాలు



కత్తిపూడి ప్రధాన రహదారిపైనే అధిక సంఖ్యలో వాహనాలు నిలిపివేయడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు, స్టిక్కర్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి.

–పినకా సతీష్, కత్తిపూడి, శంఖవరం మండలం

ముందస్తు సాగుకు సమాయత్తమవ్వండి

జేడీఏ విజయ్‌కుమార్

కరప: ఈనెల ఒకటో తేదీనే కాలువలకు సాగునీరు వదిలారని, రైతులను చైతన్యపరచి సార్వాలో ముందస్తు సాగుకు సమాయత్తం చేయాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు ఎన్.విజయ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. సరైన కార్యాచరణతో సార్వా, రబీలలో ముందస్తు సాగు చేపడితే మూడో పంటగా అపరాలు సాగుచేయవచ్చని రైతులకు వివరించాలన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం కరప సబ్ డివిజన్ పరిధిలోని కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాల వీఏఏలు, ఏఈఓలకు నిర్వహించిన ఒక రోజు శిక్షణలో ఆయన మాట్లాడుతూ సార్వాలో వెదజల్లు పద్ధతి అమలయ్యేలా చూడాని, ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో నాలుగైదు పంటలు వేసేలా రైతులను చైతన్యపరచాలన్నారు. తొలకరి పంట అక్టోబరు నెలాఖరు నాటికి కోతలు పూర్తయేలా చేయాలన్నారు. ఈ నెల 15వ తేదీకల్లా నారుమళ్లు వేసేలా చూడాలన్నారు. రబీలో నవంబరు నెల 15 నుంచి డిశంబరు 15లోగా వరినాట్లు పూర్తిచేయించాలన్నారు. సాగుఖర్చు తగ్గించేందుకు నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను ప్రోత్సహించాలన్నారు. ఏడీఏ కె.బాబూరావు రూపొందించిన ముందస్తు సాగుకు కార్యాచరణ ప్రణాళిక బుక్‌లెట్‌ను జేడీఏ ఆవిష్కరించారు. వీఏఏలకు విత్తనాల ఎంపిక, విత్తనశుద్ధి, ఎరువుల, పురుగుల మందుల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం (పెద్దాపురం) డీడీ బీవీఎస్‌సీ హరి, కాజులూరు, తాళ్లరేవు మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

నియామకాలకు తాత్కాలికంగా బ్రేక్

- ఉద్యోగులకు అన్యాయం జరగనివ్వం
- ఏపీఎన్‌జీవో నేతలకు కలెక్టర్ హామీ

కాకినాడ క్రైం: బదిలీల నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ కేడర్ల భర్తీ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని కోరిన ఏపీఎన్‌జీవో నేతల విజ్ఞాపనకు కలెక్టర్ కృతికా శుక్లా సానుకూలంగా స్పందించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహన్ అధ్యక్షతన నేతలు గురువారం కలెక్టర్ కృతికా శుక్లాను కలసి వినతి పత్రం సమర్పించారు. ఉద్యోగులకు మంచి చేసే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం తీసుకున్న బదిలీలపై నిషేధం ప్రయోజనాలను అందిపుచ్చుకోలేని స్థితి ఎదురైందని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సరిగ్గా ఇదే సమయంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో ఫార్మసిస్ట్, ఎల్‌టీలతో పాటు పలు కేడర్ల భర్తీ ప్రక్రియ చేపడుతోందన్నారు. అధికారుల నిర్ణయంతో ఏళ్లకేళ్లు లూప్‌లైన్‌లో పనిచేస్తున్న ఎందరో ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యే అవకాశం కోల్పోనున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అందించిన విన్నపంపై నియామకాలను తాత్కాలికంగా నిలిపివేస్తామని కలెక్టర్ కృతికా శుక్లా వారికి హామీ ఇచ్చారు. ఆ దిశగా డీఎంహెచ్‌వోకి ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్‌ను కలసిన వారిలో సంఘ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు, జిల్లా కోశాధికారి వై.పద్మమీనాక్షి, జిల్లా కార్యదర్శి పేపకాలయ వెంకటకృష్ణ, సహాయ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సరేళ్ల చంద్రరావు, పాలపర్తి మూర్తిబాబు తదితరులున్నారు.

రావికంపాడు రైల్వే ట్రాక్ సమీపంలో కార్చిచ్చు



రావికంపాడు రైల్వేస్టేషన్‌కు సమీపంలో కాలిపోయిన చెట్లు

తొండంగి: మండలంలోని రావికంపాడు రైల్వేస్టేషన్‌కు సమీపంలో ట్రాక్ ప్రక్కన గురువారం జామాయిల్ చెట్లు మధ్య కార్చిచ్చు రేగింది. మధ్యాహ్నం సమయంలో జామాయిల్, ఇతర చెట్ల ఆకులకు నిప్పంటుకుని మంటలు తోటలకు వ్యాపించాయి. అటుగా వెళ్తున్న బాటసారులు, రైతులు చూసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఇంతలోనే మంటలు ఆరిపోవడంతో అక్కడి వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

మానవత్వం చాటి.. అండగా నిలిచి..



తుని ఆసుపత్రిలో రక్తం ఇస్తున్న ఫణి

తుని: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు హిమోగ్లోబిన్ కారణంగా బ్లడ్ కౌంట్ తక్కువగా ఉందని సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తల మేరకు దాడిశెట్టి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ దాడిశెట్టి శ్రీనివాస్ స్పందించారు. గురువారం ఆయన స్థానిక బ్లడ్ బ్యాంకులో ఒక యూనిట్, తన టీం సభ్యుల ద్వారా డోనర్స్‌కు తెలియ పరచగా వంగలపూడి ఫణి మరో యూనిట్ రక్తాన్ని ఇచ్చారు. ఆపదలో ఆదుకొని మానవత్వం చాటిన శ్రీనివాస్‌కు ఆసుపత్రి సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

గండేపల్లి: సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... కోరుకొండ మండలం సీతారామపురం నుంచి మండలంలోని తాళ్లూరు, యల్లమిల్లి గ్రామాల మీదుగా సామర్లకోట వైపు ద్విచక్రవాహనంపై సారా తరలిస్తున్నట్టు పోలీసులకు ముందస్తుగా సమాచారం వచ్చింది. ఈ మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేసి సారా తరలిస్తున్న పిల్లి వెంకటేష్‌ను అరెస్ట్ చేశారు. అతని నుంచి 10 లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం పెద్దాపురం కోర్టుకు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రౌతులపూడి: స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో జగ్గంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కొట్టాం, గిడజాం, రౌతులపూడి టౌన్, రౌతులపూడి రూరల్ ఫీడర్ పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

జగ్గంపేట: వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్థానిక సీఐ సూర్య అప్పారావు పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం లారీ, ట్రాక్టర్ డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి ఇతర ప్రయాణికులు, వాహనాలకు ఆటంక కలిగించవద్దన్నారు. టిప్పర్, ట్రాక్టర్ డ్రైవర్లు అధిక లోడు, వేగంతో వెళుతున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.